నిబంధనల ప్రకారమే ఫీజులు వసూలు చేయాలి

ఇంజినీరింగ్ కాలేజీలకు జేఎన్టీయూ రిజిస్ట్రార్ ఆదేశం

హైదరాబాద్, వెలుగు: జేఎన్టీయూ అనుబంధ కాలేజీలు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను మాత్రమే వసూలు చేయాలని ఆ వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. జేబీఐఈటీ కాలేజీలో అదనపు ఫీజుల వసూళ్లపై రాకేశ్, హనుమంత్ నాయక్ జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 6న కమిషన్ సభ్యులు బాలోత్ హన్స్‌రాజ్ అధ్యక్షతన ఢిల్లీలో జేఎన్టీయూ రిజిస్ట్రార్‌తో పాటు జేబీఐఈటీ ప్రిన్సిపల్ సమావేశం జరిగింది. జేఎన్టీయూ, ఉస్మానియా, కాకతీయ వర్సిటీలు తమ అనుబంధ ఇంజినీరింగ్ కాలేజీలో నిబంధనల ప్రకారం ఫీజు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కాలేజీలను బ్లాక్ లిస్టులో పెడ్తామని జేఎన్టీయూ హెచ్చరించింది.

జేఎన్‌టీయూకు అరుదైన అవకాశం

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ ఆర్ అండ్ డి విభాగానికి పరిశోధనల్లో భాగస్వామ్యాన్ని కల్పిస్తూ కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ అరుదైన అవకాశాన్ని కల్పించింది. దేశవ్యాప్తంగా కొన్ని సంస్థలను గుర్తించగా అందులో జేఎన్‌టీయూ ఆర్ అండ్ డి కూడా ఉంది. ఇటీవల కొన్ని వివరాలను కోరిన కేంద్రానికి. . ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ ఎ.చెన్నకేశవరెడ్డి వివరాలు పంపగా వారు పరిశోధనలకు సహకారం అందించేందుకు అవకాశం కల్పించారు. ఇందులో భాగంగా స్టీల్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఆర్‌టీఎంఐ) పథకంలో ద్వారా ఉక్కు పరిశ్రమలోని ప్రాధాన్యతా రంగాల్లో ఆర్ అండ్ డి ద్వారా పరిశోధనలకు ఆస్కారం ఉంటుంది. ఈ అవకాశం వచ్చినందుకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి ఆర్ అండ్ డి డైరెక్టర్‌ను అభినందించారు.

అధిక ఫీజు వసూలు చేస్తే కఠిన చర్యలు: రిజిస్ట్రార్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ కళాశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన అన్ని గుర్తింపు పొందిన ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జేబీఐఈటీ కళాశాల అధిక ఫీజులు వసూలు చేయడంపై కేంద్ర ఎస్‌టీ కమిషన్‌కు విద్యార్థులు ఫిర్యాదు చేయగా రిజిస్ట్రార్, అధికారులు దిల్లీలో కమిషన్ ముందు హాజరైన విషయం తెలిసిందే. మరోవైపు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు.. ఉద్యోగులకు మాత్రం వేతన సంఘం నిబంధనలకు అనుగుణంగా జీతాలు ఇవ్వకపోవడంపై విచారణ జరిపించాలని రాష్ట్ర సాంకేతిక కళాశాలల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సంతోష్‌కుమార్ ప్రకటనలో డిమాండ్ చేశారు.